

గౌహతి ఐఐటీలో సీటు పొందిన గూడెం గ్రామానికి చెందిన సోంరెడ్డి దీప్తిని హైదరాబాద్‌లో అభినందించి ల్యాప్‌టాప్ అందజేస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

## ఐఐటీ విద్యార్థినికి అండగా కేటీఆర్

- **చదువు పూర్తయ్యే వరకూ ఖర్చు భరిస్తానని హామీ**

ముస్తాబాద్, జూలై 25: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ పేదలపై ఉన్న మమకారాన్ని మరోసారి చాటుకున్నారు. అస్సాంలోని గౌహతి ఐఐటీలో సీటు సాధించిన నిరుపేద విద్యార్థిని చదువుకయ్యే ఖర్చంతా భరిస్తానని హామీ ఇచ్చారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం గూడెం గ్రామానికి చెందిన సోంరెడ్డి పద్మ-చంద్రంది నిరుపేద కుటుంబం. వీరి కొడుకు దుర్గాప్రసాద్ మెకానిక్‌గా పనిచేస్తుండగా, కూతురు దీప్తి 10వ తరగతి వరకు ఇంటివద్ద చదివి మండలంలోని నామాపూర్ మాడల్ స్కూల్‌లో ఇంటర్ పూర్తి చేసింది. ఇటీవలే గౌహతి ఐఐటీలో డాటా సైన్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సులో సీటు సాధించింది. ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలో చదివేందుకు కావాల్సినంత ఆర్థిక స్థోమత ఆ కుటుంబానికి లేదు. దీప్తి కుటుంబ సభ్యులు దాతల నుంచి ఆర్థిక సాయం కోసం ప్రయత్నించారు. ఈ విషయం కేటీఆర్ దృష్టికి రావడంతో ఆయన ఆ కుటుంబానికి అండగా నిలిచారు. బర్త్ డే సందర్భంగా తనను కలిసేందుకు హైదరాబాద్ వచ్చిన దీప్తి కుటుంబానికి కేటీఆర్ ఆర్థిక సాయం అందిస్తానని హామీ ఇచ్చారు. దీప్తి నాలుగేండ్ల కోర్సు పూర్తి చేయడానికి కావాల్సిన మొత్తం ఖర్చు భరిస్తానని చెప్పారు. కేటీఆర్ పుట్టిన రోజు సందర్భంగా 'గిఫ్ట్ ఏ స్మైల్' కార్యక్రమంలో భాగంగా దీప్తికి ల్యాప్‌టాప్‌ను బహూకరించారు.



రామగుండం టౌన్‌షిప్‌లోని జ్యోతిక వీఐపీ గెస్ట్‌హౌస్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు స్వాగతం పలుకుతున్న టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, తదితరులు

## 'ఖని'లో బీఆర్ఎస్ బృందం బస

గోదావరిఖని/ పాలకుర్తి, జూలై 25: కాళేశ్వరం ప్రాజెక్టుల సందర్శనకు బయలుదేరిన కేటీఆర్ నేతృత్వంలోని ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల బృందం గురువారం రాత్రి 11 గంటలకు గోదావరిఖని పట్టణానికి చేరుకున్నది. అంతకుముందు కరీంనగర్ నుంచి బయలుదేరిన బృందానికి బసంత్‌నగర్‌లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కౌశికహరి ఆధ్వర్యంలో పలువురు నాయకులు ఘనస్వాగతం పలికారు. భారీగా వర్షం కురుస్తున్నప్పటికీ సుమారు 200 మంది కేశోరాం కార్మికులు, మహిళలు కేటీఆర్ కోసం రాజీవ్‌రహదారిపై ఓపికగా వేచి ఉన్నారు. తర్వాత అక్కడి నుంచి బీఆర్ఎస్ బృందం రామగుండంలోని ఎన్టీపీసీకి రాగా, ఇక్కడి ఎన్టీపీసీ టౌన్‌షిప్‌లోని జ్యోతిక వీఐపీ గెస్ట్‌హౌస్ వద్ద మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం అక్కడే బస చేశారు.

# రైతుల జీవితాలతో ఆటలా?

**నీళ్లు అందుబాటులో ఉన్నప్పుడే పంపింగ్ చేయాలి**

- **పది లక్షల క్యూసెక్కుల ప్రవాహాన్ని తట్టుకుని కాళేశ్వరం నిలబడింది**
- **కక్ష సాధింపులు మంచిది కాదు**
- **పంపింగ్ చేసి రిజర్వాయర్లు నింపాలి**
- **బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**
- **ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల బృందంతో కలిసి ఎల్ఎండీ సందర్శన**



ఎండిపోయిన ఎల్ఎండీని పరిశీలిస్తున్న మాజీ మంత్రులు కేటీఆర్, మల్లారెడ్డి, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్ తదితరులు

కరీంనగర్, జూలై 25 (నమస్తే తెలంగాణ): రాజకీయ ప్రయోజనాల కోసం రైతుల జీవితాలతో చెలగాటం ఆడొద్దని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ సర్కార్‌కు సూచించారు. రాజకీయాలు, కక్షసాధింపు చర్యలకు పోతే రైతులు, ప్రజలు నష్టపోతారని అన్నారు. తక్షణమే ప్రభుత్వం కాళేశ్వరం నుంచి నీటిని పంపింగ్ చేసి రాష్ట్రంలోని రిజర్వాయర్లను నింపాలని డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనకు బయలుదేరిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల బృందంతో కలిసి కేటీఆర్ ఎల్ఎండీ రిజర్వాయర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక నీటిపారుదల శాఖ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎల్ఎండీ రిజర్వాయర్‌లో గతేడాది ఇదే సమయానికి ఎంత నీరు ఉన్నది? ఇప్పుడు ఎంత ఉన్నదని తెలుసుకున్నారు. మొదట క్రికెట్ మైదానాన్ని తలపిస్తున్న రిజర్వాయర్‌ను, కాకతీయ దిగువ కాలువ వద్ద ఉన్న హెడ్ రెగ్యులేటర్ వద్ద నీటి మట్టాన్ని, గేట్ల వద్దకు వెళ్లి అక్కడి నీటి మట్టాన్ని పరిశీలించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి కొద్దిసేపు అక్కడి కార్యాలయంలో అధికారులతో మాట్లాడారు. కేటీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర సాగునీటి రంగంలో విప్లవాన్ని సృష్టించారని తెలిపారు. ముఖ్యంగా గోదావరి నదిలో వృథాగా పోతున్న వందల టీఎంసీల నీటిని ఒడిసిపట్టి తెలంగాణలోని బీడు భూములకు మళ్లించాలనే అద్భుతమైన ఆలోచన చేసి ఆచరణలో చూపారని అన్నారు. మేడిగడ్డ నుంచి మొదలు పెడితే అన్నారం, సుందిళ్ల బరాజ్‌లతో సహా 19 బరాజ్‌లు, రిజర్వాయర్లు, పంప్‌హౌస్‌లు, వందల కిలోమీటర్ల గ్రావిటీ కాలువలు, వేల కిలోమీటర్ల పిల్ల కాలువలు తవ్వించారని, మొత్తంగా చూస్తే ప్రపంచంలోనే అతి పెద్దదైన మల్టీ స్టేజ్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు రూపంలో కాళేశ్వరాన్ని నిర్మించారని గుర్తుచేశారు. దురదృష్టవశాత్తు మేడిగడ్డలో జరిగిన ఒక చిన్న ఘటనను పట్టుకొని, దానిని భూతద్దంలో చూపించి మొత్తం కాళేశ్వరాన్ని ఒక విఫల ప్రాజెక్టుగా చూపే ప్రయత్నంలో సీఎం రేవంత్‌రెడ్డి ఉన్నారని, గత 8 నెలలుగా లక్షలాది మంది రైతుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని ధ్వజమెత్తారు. గతేడాది సరిగ్గా ఇదే రోజు ఎల్ఎండీ రిజర్వాయర్‌లో 12 టీఎంసీలకుపైగా నీరు ఉండేదని, ఇదే సమయంలో కాళేశ్వరం నుంచి సమయానికి పంపింగ్ చేయడం వల్ల పూర్తిస్థాయి నీటిని నిలిపి రైతుల గుండెల్లో భరోసా ఇవ్వగలిగామని చెప్పారు. కానీ, ఈ ఏడాది పరిస్థితి గురించి అధికారులతో మాట్లాడితే.. ఇప్పటివరకు 45 శాతం తక్కువ వర్షపాతం నమోదైందని, సెప్టెంబర్ వరకు వర్షాలు కురిసే అవకాశం ఉన్నా గ్యారంటీ లేకుండా పోయిందని చెప్పినట్టు తెలిపారు. ఇప్పుడు వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గోదావరిలో వరద ఉన్నప్పుడు నీటిని పంపింగ్ చేయాల్సి ఉన్నదని, అయితే పంపింగ్‌పై నీటి పారుదల శాఖకు ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎలాంటి ఆదేశాలు రాలేదని అన్నారు. ఒక పక్క గోదావరిలో లక్షల క్యూసెక్కుల నీళ్లు కిందికి పోతున్నాయని, మరో పక్క ప్రభుత్వం పంపింగ్‌పై ఎలాంటి నిర్ణయం తీసుకోకుండా చోద్యం చూస్తున్నదని మండిపడ్డారు. అందుకే తమ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనకు బయలుదేరిందని తెలిపారు. ఒక పక్క అసెంబ్లీ సమావేశాలు ఉన్నప్పటికీ ఎండిపోతున్న ఎల్ఎండీ, దానిపైన ఉన్న మిడ్‌మానేరు, ఆ పైన ఉన్న ఎస్సారెస్పీ, వరద కాలువపై ఉన్న వేలాది మోటర్లను పరిశీలించేందుకు, వాస్తవాలను వివరించి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకే తాము ప్రాజెక్టుల సందర్శనకు వచ్చినట్టు తెలిపారు. రంగనాయకసాగర్, కొండపోచమ్మ సాగర్, అన్నపూర్ణ రిజర్వాయర్ నింపితే రైతులకు ఒక భరోసా ఇచ్చినట్లవుతుందని అన్నారు. సాగునీటి విషయంలో రైతులకు పూర్తి స్థాయి స్పష్టత వస్తుందనే ఉద్దేశంతో తాము కాళేశ్వరం సిస్టంలోని రిజర్వాయర్లు, పంప్‌హౌస్‌ల సందర్శనకు బయలు దేరామని, ఇక్కడి వాస్తవాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని స్పష్టంచేశారు. కన్నెపల్లి వద్ద పంపింగ్ ప్రారంభిస్తే కాళేశ్వరం పరిధిలోకి వచ్చే అన్ని రిజర్వాయర్లు నిండే అవకాశం ఉన్నదన్నారు. మల్లన్నసాగర్‌లో 50 టీఎంసీలు, కొండపోచమ్మ సాగర్‌లో 15 టీఎంసీలు నింపితే కేవలం రైతులకే కాకుండా హైదరాబాద్ మహానగరానికి మంచినీటి అవసరాలు కూడా తీరుతాయని, మార్గమధ్యంలో ఉండే వేలాది గ్రామాలకు ఇతర జిల్లాలు, నియోజకవర్గాలకు కూడా మంచినీటికి ఇబ్బందులు లేకుండా సర్దుబాటు చేసుకునే అవకాశం ఉంటుందని కేటీఆర్ సూచించారు.

### మేడిగడ్డ మేడిపండు కాదు..

మేడిగడ్డ మేడిపండు అయిపోయిందని, అది గోదావరి నీటిలో కొట్టుకుపోతుందని, లక్షల కోట్లు వృథా అయ్యాయని కాంగ్రెస్ నాయకులు, ప్రభుత్వ పెద్దలు చేసిన ప్రచారమంతా ఉత్తదేనని తేలిపోయిందని కేటీఆర్ అన్నారు. దాదాపు 10 లక్షల క్యూసెక్కుల నీటి ప్రవాహాన్ని తట్టుకుని మేడిగడ్డ ఠీవీగా నిలబడి ఉన్నదని అన్నారు. గురువారం ఎల్ఎండీకి వచ్చినట్టుగానే అవసరమైతే అన్ని రిజర్వాయర్లకు వెళ్లి వాస్తవ పరిస్థితులు పరిశీలిస్తామని అన్నారు. శుక్రవారం ఉదయం కన్నెపల్లి పంప్‌హౌస్‌కు వెళ్తున్నామని, అదే విధంగా మేడిగడ్డ బరాజ్, కాళేశ్వర ఆలయాన్ని కూడా సందర్శిస్తామని చెప్పారు. ఎమ్మెల్యేల బృందంలో గంగుల కమలాకర్, జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, సీహెచ్ మల్లారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సునీతాలక్ష్మారెడ్డి, మాగంటి గోపీనాథ్, విజయుడు, ఎ మ్మెల్సీలు గోరటి వెంకన్న, తాతా మధు, శంభీపూర్ రాజు, శేరి సుభాష్‌రెడ్డి, ఎంసీ కోటిరెడ్డి, మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, కొప్పుల ఈశ్వర్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా ఎల్ఎండీ వద్ద మాజీ ఎమ్మెల్యేలు సుంకె రవిశంకర్, బాల్క సుమన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, మేయర్ వై సునీల్‌రావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, నాయకులు చల్మెడ లక్ష్మీనరసింహారావు, పొన్నం అనిల్‌గౌడ్, ఏనుగు రవీందర్‌రెడ్డి తదితరులు కేటీఆర్ బృందానికి స్వాగతం పలికారు.



కరీంనగర్ శివారులోని డ్యాం కట్టపై నీటిలో నుంచి నడుచుకుంటూ వస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. చిత్రంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకులు

### వానకాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఖమ్మం | 32.0°c | 25.0°c |
| నల్లగొండ | 29.5°c | 23.0°c |
| ఆదిలాబాద్ | 29.2°c | 23.9°c |
| మహబూబ్‌నగర్ | 28.2°c | 22.4°c |
| వరంగల్ | 27.0°c | 23.0°c |
| నిజామాబాద్ | 26.7°c | 22.9°c |
| రంగారెడ్డి | 26.7°c | 21.7°c |
| మెదక్ | 26.5°c | 22.0°c |
| కరీంనగర్ | 26.0°c | 24.0°c |
| హైదరాబాద్ | 26.0°c | 23.0°c |



### మరో రెండు రోజులు వానలు

- **పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్: వాతావరణశాఖ**

హైదరాబాద్, జూలై 25 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో మరో రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది. రాష్ట్రంలో వారం రోజులుగా ఎడతెరిపినివ్వకుండా వానలు కురుస్తున్నాయి. దీంతో వాగులు పొంగి పొర్లుతుండగా, జలాశయాలు నిండుకుండలా మారాయి. ఉత్తర ఛత్తీస్‌గఢ్ వద్ద అల్పపీడనం ఏర్పడి, తూర్పు మధ్యప్రదేశ్ మీదుగా కొనసాగుతున్నట్టు అధికారులు వెల్లడించారు. ఈ ప్రభావం ఉత్తర తెలంగాణ జిల్లాలపై ఉంటుందని తెలిపారు. ఆసిఫాబాద్, పెద్దపల్లి, జగిత్యాల, మంచిర్యాల, భూపాలపల్లి జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని ఎల్లోఅలర్ట్ జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా జూన్ 1 నుంచి గురువారం వరకు సాధారణం కంటే 30 శాతం అధిక వర్షపాతం నమోదైనట్టు వాతావరణ శాఖ తెలిపింది. గురువారం వరకు 312.2 మి.మీ సాధారణ వర్షపాతం కురియాల్సి ఉండగా, ఇప్పటి వరకు 407.3 మి.మీ వర్షపాతం నమోదైంది. గత 24 గంటల్లో కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని కౌటాల మండలంలో అత్యధికంగా 4.34 సెం.మీ వర్షపాతం నమోదైంది.

**● గోదావరి వెలవెల..**



జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం వద్ద నీరులేక వెలవెలబోతున్న గోదావరి

**● మిడ్‌మానేరు మౌనరోదన**



ఎండిపోయిన మధ్యమానేరు జలాశయం

**● మైదానంలా లోయర్ మానేరు**



మైదానాన్ని తలపిస్తున్న కరీంనగర్‌లోని లోయర్ మానేరు డ్యాం లోపలి ప్రాంతం

# కాళేశ్వరమే కల్పతరువు

మొదటిపేజీ తరువాయి...

కృష్ణా నదుల్లోని నికర, మిగులు జలాలను సమర్థంగా వినియోగించుకొని, కోటి ఎకరాలకు సాగునీరందించాలన్న లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేసింది. అందుకోసమే నూతన జల విధానం (రీడిజైనింగ్)కు శ్రీకారం చుట్టింది. ఈ స్వప్నంలో మొదటి భాగం కాళేశ్వరం ఎత్తిపోతల పథకం. గోదావరి ట్రిబ్యునల్ అవార్డు ఆధారంగా గోదావరి జిల్లాలో ఉమ్మడి రాష్ట్రానికి 75 శాతం విశ్వసనీయత కలిగిన నికర జలాల కేటాయింపులు 1,489 టీఎంసీలు ఉంటాయని లెక్క గట్టి.. అందులో 954 టీఎంసీలను తెలంగాణ ప్రాజెక్టులకు కేటాయించింది. ఉమ్మడి రాష్ట్రానికి ఈ కేటాయింపులు చేసినప్పటికీ. ప్రాజెక్టులు పూర్తికాకపోవడంతో అవన్నీ కాగితాలకే పరిమితమయ్యాయి. వాస్తవ వినియోగం ఏనాడు 400 టీఎంసీలకు మించి లేదు. తెలంగాణ ప్రభుత్వం ఈ అంశాలను అధ్యయనం చేసి.. గోదావరి జలాల గరిష్ఠ వినియోగం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతోనే సాధ్యమవుతుందని భావించి.. రూపకల్పన చేసింది. దీని ద్వారా వట్టిపోయిన శ్రీరాంసాగర్, నిజాంసాగర్, సింగూరు, ఎగువమానేరు, దిగువమానేరు, మధ్యమానేరు తదితర జలాశయాలు జీవం పోసుకుంటాయని భావించింది. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా 45 లక్షల ఎకరాలకు సాగునీరు, 1.80 కోట్ల ప్రజానీకానికి తాగునీరుతోపాటు పరిశ్రమల స్థాపనకు నీరు ఉపయోగపడుతుందని నిర్ణయించింది. ఎల్లంపల్లి-తూపాకుల గూడెం బరాజ్ మధ్య దాదాపు 170 కిలోమీటర్ల పరిధిలో పర్యావరణం వృద్ధి చెందుతుందని విశ్వసించి, ఆచరణ సాధ్యం కాదని భావించి కాళేశ్వరాన్ని తొలితెలంగాణ ముఖ్యమంత్రి సుసాధ్యం చేసి చూపించారు.



జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మేడిగడ్డ బరాజ్ వద్ద వరద ఉధృతి

### ప్రాణహిత, ఇంద్రావతే ప్రాణాధారం

సమైక్య ప్రభుత్వాలు ఆదిలాబాద్ జిల్లా తమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును నిర్మించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. అందులో కుట్ర దాగి ఉన్నదని ఉద్యమ నేతగా ఉన్న సమయం నుంచి వాదిస్తూ వచ్చిన కేసీఆర్.. స్వరాష్ట్రం వచ్చాక అందులోని లోటుపాట్లపై ఆరా తీశారు. లోపాలను బహిర్గతం చేశారు. అంతేకాదు ఈ ప్రాజెక్టు వెనుక దాగి ఉన్న కుట్రను అసెంబ్లీ సాక్షిగా కళ్లకు కట్టినట్టుగా చూపించారు. గణాంకాలతో సహా వివరించారు. మేడిగడ్డ, తమ్మిడిహెట్టి వద్ద 47 ఏండ్ల నీటి లెక్కల ఆధారంగా తొలి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ వాస్తవాలను శాసనసభ ముందు పెట్టిన విషయం తెలిసిందే. తమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యత తక్కువగా ఉన్నదని చెప్పడంతోపాటు ప్రాణహిత కలిసే కాళేశ్వరం వద్ద 1,651 టీఎంసీల లభ్యత ఉన్నదని తన ప్రసంగంలోనే అసెంబ్లీలో వివరించారు. గోదావరిలో ఇంద్రావతి కలిసే పేరూర్ వద్ద సరాసరి 2,430 టీఎంసీల లభ్యత ఉన్నదన్న విషయాన్ని వెల్లడించారు.

### ఎత్తిపోతలపై ఎందుకు వివక్ష?

ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ఎత్తిపోసే అవకాశం ఉన్నా రేవంత్ సర్కార్ వివక్ష చూపుతున్నది. ప్రస్తుతం మేడిగడ్డ (లక్ష్మీ బరాజ్) వద్ద 7,71,580 క్యూసెక్కులు అంటే దాదాపు 70 టీఎంసీల నీరు సముద్రం పాలవుతున్నది. నిజానికి ఈ సీజన్‌లో ఇప్పటికే దాదాపు 390 టీఎంసీల నీరు సముద్రం పాలు కాగా, శుక్రవారం ఉదయం వరకు 440 టీఎంసీల వరకు చేరుకుంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. దిగువన వందల టీఎంసీలు సముద్రం పాలవుతుంటే.. ఎగువన ఉన్న ప్రాజెక్టులు మాత్రం వెలవెలబోతున్నాయి. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి సామర్థ్యం 90 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 26.263 టీఎంసీల నీరు వచ్చి చేరింది. 17,222 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతున్నది. శ్రీరాంసాగర్ ప్రాజెక్టును పక్కన పెడితే మధ్యమానేరు (శ్రీరాజరాజేశ్వర జలాశయం) సామర్థ్యం 27.5 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 5.82 టీఎంసీల నీరు ఉన్నది. ఇన్‌ఫ్లో అంతంత మాత్రమే. లోయర్ మానేరు డ్యాం సామర్థ్యం 24.034 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 5,296 టీఎంసీల నీరు ఉన్నది. అప్పర్ మానేరు జలాశయం పూర్తి సామర్థ్యం 2 టీఎంసీలు కాగా ప్రస్తుతం 0.45 టీఎంసీలు, అన్నపూర్ణ జలాశయ సామర్థ్యం 3.5 టీఎంసీలు కాగా, 0.75 టీఎంసీలు, నందిమేడారం జలాశయ సామర్థ్యం 0.135 టీఎంసీలు కాగా 0.747 టీఎంసీల నీరు మాత్రమే ఉన్నది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే ప్రాజెక్టుల పరిస్థితి ఇలావుంటే.. రంగనాయకసాగర్, మల్లన్న సాగర్, కొండపోచమ్మ సాగర్ ప్రాజెక్టుల పరిస్థితి ఎలా ఉన్నదో అర్థం చేసుకోవచ్చు. నిజానికి ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వస్తున్న ఇన్‌ఫ్లో ప్రకారం నీటిని పైప్రాజెక్టులకు ఎత్తిపోయవచ్చు. ఎల్లంపల్లి సామర్థ్యం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 14.04 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. ఇన్‌ఫ్లో 23,072 క్యూసెక్కులుగా వస్తున్నది. కడెం ప్రాజెక్టు నిండింది. ఇన్‌ఫ్లో ఇంకా పెరిగే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు. ఒక వేళ ఇన్‌ఫ్లో తగ్గినా కడెం ప్రాజెక్టు నుంచి ఎల్లంపల్లికి నీరు తీసుకోవడానికి వీలున్నది. ప్రస్తుత పరిస్థితుల్లో ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నందిమేడారం రిజర్వాయర్ ద్వారా లక్ష్మీ పంపుహౌస్‌కు పంపించి.. అక్కడి నుంచి మధ్యమానేరు, అలాగే లోయర్‌మానేరు డ్యాంలకు నీరు ఇవ్వొచ్చు. ప్రస్తుతం ఎల్లంపల్లి ప్రాజెక్టులో ఉన్న నీటి నిల్వలను బట్టి చూస్తే.. మూడు టీఎంసీలకు వరకు ఎత్తిపోసుకోవచ్చని అధికారులు చెబుతున్నారు. నందిమేడారం జలాశయం వద్ద మూడు పంపులు ఆన్‌చేసి ఈ నీటిని పైకి ఎత్తిపోయవచ్చు.కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం ఈ విషయంలో శ్రద్ధ చూపడం లేదు. మేడిగడ్డతోపాటు అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టులు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వాకం వల్ల నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) పరిధిలోకి వెళ్లిపోయాయి. వాళ్లు నీటిని స్టోరేజ్ చేయవద్దని సూచించారు. నిజానికి చిన్న లోపాలను పెద్దగా చూపి.. దాదాపు ఏడు నెలలపాటు కాంగ్రెస్ ప్రభుత్వం సమయాన్ని వృథాచేసింది. సీజన్ ప్రారంభంలో సర్వేలు చేయడం వల్ల ప్రస్తుతం నీరు తీసుకునే సౌలభ్యం లేకుండాపోయింది. అంతేకాదు, ఇక్కడి ఇంజినీర్లు బ్రహ్మాండగా పనిచేస్తున్నారని నేషనల్, ఇంటర్‌నేషనల్ ఇంజినీర్లు ప్రశంసిస్తుంటే.. ఇక్కడి ప్రభుత్వం వారిని పక్కన పెట్టి.. ఏజెన్సీలు ఇతర పేర్లతో ప్రాజెక్టుల స్వల్ప రిపేర్ల విషయంలో ఇబ్బందులు పెడుతున్నది. ఈ నేపథ్యంలో నీటిని ఎత్తిపోసుకునేందుకు ఒకే ఒక ఆధారం ఎల్లంపల్లి ప్రాజెక్టు. వచ్చిన నీటిని వచ్చినట్టుగా ఎత్తిపోసుకుంటే ఎగువ ప్రాజెక్టులకు నీరు వచ్చే అవకాశమున్నది. ఇంకా కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాగే ఒంటెత్తు పోకడలకు పోతే.. ఎగువన ఉన్న ప్రాజెక్టుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఏర్పడుతుంది. కాగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధ్యక్షతన శుక్రవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం మేడిగడ్డను సందర్శించనున్నది.

### 44 ఏండ్లలో సముద్రం పాలైన గోదావరి జలాల వివరాలు (1970-71 నుంచి 2014 వరకు)

| సంవత్సరం | నీళ్లు (టీఎంసీలలో) |
|---|---|
| 2013-2014 | 3364.5 |
| 2012-2013 | 1446.7 |
| 2011-2012 | 1146.8 |
| 2010-2011 | 1965.1 |
| 2009-2010 | 541.3 |
| 2008-2009 | 766.0 |
| 2007-2008 | 1419.5 |
| 2006-2007 | 2200.5 |
| 2005-2006 | 1875.8 |
| 2004-2005 | 464.7 |
| 2003-2004 | 1230.1 |
| 2002-2003 | 991.5 |
| 2001-2002 | 1104.3 |
| 2000-2001 | 1545.2 |
| 1999-2000 | 1782.8 |
| 1998-1999 | 1739.1 |
| 1997-1998 | 921.1 |
| 1996-1997 | 776.9 |
| 1995-1996 | 1509.4 |
| 1994-1995 | 2984.7 |
| 1993-1994 | 931.1 |
| 1992-1993 | 1558.2 |
| 1991-1992 | 994.9 |
| 1990-1991 | 3271.7 |
| 1989-1990 | 1859.6 |
| 1988-1989 | 3272.8 |
| 1987-1988 | 633.4 |
| 1986-1987 | 1894.8 |
| 1985-1986 | 999.0 |
| 1984-1985 | 923.8 |
| 1983-1984 | 3810.0 |
| 1982-1983 | 1132.7 |
| 1981-1982 | 2232.4 |
| 1980-1981 | 2067.3 |
| 1979-1980 | 1597.7 |
| 1978-1979 | 2408.8 |
| 1977-1978 | 1780.7 |
| 1976-1977 | 2105.3 |
| 1975-1976 | 3130.5 |
| 1974-1975 | 1072.8 |
| 1973-1974 | 2822.1 |
| 1972-1973 | 784.1 |
| 1971-1972 | 1132.4 |
| 1970-1971 | 3001.9 |

44 ఏండ్ల సగటు చూస్తే ఏటా 1709.0 టీఎంసీల నీరు సముద్రం పాలైంది.

### కాంగ్రెస్ కళ్లు తెరవాలి..

సమైక్య రాష్ట్రంలో తెలంగాణ నిలువెల్లా కరువును ఎదుర్కొని వేలాది మంది అన్నదాతలు ఆత్మహత్యలు చేసుకున్నా ఆనాటి పాలకులు స్పందించలేదు. సాగునీరు ఇచ్చి అన్నదాతలను ఆదుకునేందుకు చర్యలు తీసుకోలేదు. నిజానికి 1970-71 నుంచి 2014 వరకు అంటే 44 ఏళ్ల లెక్కలను తీ సుకుంటే.. ఏటా 1,709 టీఎంసీల గోదావరి నీరు సముద్రం పాలైన ఆనాటి పాలకులు ప్రాజెక్టులు కట్టాలన్న ఆలోచన చేయలేదు. స్వరాష్ట్రం కోసం ఉద్యమం తీవ్రమవుతున్న సమయంలో కంటితుడుపు చర్యగా సమైక్య ప్రభుత్వం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత-చేవెళ్ల పథకాన్ని 2008లో తెరపైకి తెచ్చి ప్రారంభించింది. ప్రాణహిత నదిపై ఆదిలాబాద్ జిల్లాలో తమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల పూర్తిస్థాయి మట్టంతో బరాజ్ నిర్మించి 160 టీఎంసీల ప్రాణిహిత నీటిని ఎల్లంపల్లికి తరలించి అ క్కడి నుంచి మిడ్‌మానేరు ద్వారా చేవెళ్లకు చేర్చాలని అప్పటి సర్కారు కేంద్రానికి ప్రతిపాదించింది. ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, మెదక్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లో 16.40 లక్షల ఎకరాలకు సాగునీరు, హైదరాబాద్ జంట నగరాలకు తాగునీరు అందించే లక్ష్యంతో ఈ పథకాన్ని చేపట్టినట్టు చెప్పింది. నాటి ఏపీ ప్రభుత్వం పంపిన డీపీఆర్‌ను కేంద్ర జల సంఘంలో ని హైడ్రాలజీ డైరెక్టరేట్ వారు పరిశీలించి.. తమ్మిడిహెట్టి వద్ద నీటి లభ్యతపై పలు అనుమానాలను లేవనెత్తుతూ.. 2015 మార్చి 4న స్పష్టమైన లేఖ రాశారు. విచిత్రం ఏమిటంటే తమ్మిడిహెట్టికి సంబంధించిన ఎటువంటి ఆమోదం రాకముందే.. నాటి ప్ర భుత్వం 7 లింకులు 28 ప్యాకేజీలుగా విభజించి టెండర్లు పిలిచి పనులు ప్రారంభించింది. తమ్మిడిహెట్టి వద్ద బరాజ్ పనులు తప్ప అన్ని ప్యాకేజీల్లో పనులు ప్రారంభించింది. అప్పటి ప్రభుత్వం 2014 జూన్ వరకు ఈ ప్రాజెక్టులపై దాదాపు 7 వేల కోట్లు ఖర్చు చేసింది. అంతేకాదు.. బరాజ్‌కు అనుమతి రాకుండా ప్యాకేజీ పనులు చేపట్టి అపఖ్యాతిని మూటకట్టుకున్నది.